# రైతులను మభ్యపెడుతున్నారు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్
- పాత కలెక్టరేట్ ఆవరణలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష


దీక్షలో మాట్లాడుతున్న పోతుగంటి భరత్‌ప్రసాద్

కందనూలు, ఏప్రిల్ 5 : తెలంగాణ రైతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మభ్యపెడుతున్నారని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఒకరోజు సత్యాగ్రహ దీక్షను శుక్రవారం చేపట్టారు. ముఖ్య అతిథులుగా బీజేపీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భం గా భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మభ్యపె డుతూ ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిం చారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎలా విస్మరించిందో రేవంత్ సర్కార్ కూడా అదేరకంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపర్చలేకపోయిందని విమర్శించారు. ఆసరా పింఛన్లు రూ. 4వేల, సబ్సిడీ సిలిండర్లు, వడ్లకు రూ. 500 బోనస్ వంటి హామీలు నేటికీ అమలు చేయలేదన్నారు. ముగ్గురు మహిళలకు తమకు పింఛన్లు రావడం లేదని కన్నీరు పెట్టుకోగా భరత్‌ప్రసాద్ జోలే పట్టి కార్యకర్తల దగ్గర డబ్బులు సేకరించి ముగ్గురు మహిళలకు ఇచ్చారు. తాను ఎంపీగా ఎన్నికైతే పేద ప్రజల కోసం పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి కోసం కమలం పువ్వుకు ఓటేయాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మవద్దన్నారు. బీజేపీ అధి కార ప్రతినిధి దిలీపాచారి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి గురైందన్నారు. పదేళ్లుగా అవినీతిపై నిరంతరం పోరాటం చేశామన్నారు. నాగర్‌కర్నూల్‌కు వచ్చిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అంతకు ముందు భారతదేశ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారాయణచారి, శేఖర్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజావర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్, పోల్‌దాస్ రాము, శ్రీశైలం, అతినారపు తిరుపతయ్య, దోమ తిరుపతిరెడ్డి, వసంతగౌడ్, బాల్‌రెడ్డి, ఎలిమే రాము, గుమ్మకొండ భూషయ్య ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పడకేసిన యాంత్రీకరణ

- ఆధునిక వ్యవసాయంలో కనిపించని సబ్సిడీ యంత్రాలు
- టార్పాలీన్ కవర్లు, విత్తనాలు కూడా..
- ఐదేళ్లుగా సబ్సిడీ పథకాన్ని ఎత్తేసిన ప్రభుత్వం
- సాగు భారమవుతుందంటున్న రైతులు


వరి కోత మిషన్

**ఆధునిక వ్యవసాయంలో రైతులకు యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. యంత్రాలతో సాగుకు తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పనులు పూర్తి చేయడమే కాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. అందుకోసం ఉమ్మడి రాష్ట్రంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించారు. ఈ పథకాన్ని తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా 2017వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించింది. ఆ తరువాత వ్యవసాయానికి సంబంధించిన ఏ పరికరాన్ని కూడా సబ్సిడీపై అందించడం లేదు.**

పాలమూరు, ఏప్రిల్ 5 : ఆధునిక వ్యవసాయంలో భాగంగా గత ప్రభుత్వాలు 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఈ పథకంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, విత్తనాలు అందజేసేవారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ పై అందించడంతో సాగు ఖర్చు చాలా తక్కువయ్యేది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన కొంతకాలానికి ఈ పథకాన్ని బంద్ చేశారు. 2016-17లో సబ్సిడీ ట్రాక్టర్ల కోసం 3వేలకు పైగా దరఖాస్తు చేసుకుంటే కేవలం మూడు వందల మందిని ఎంపిక చేశారు. దీంతో వచ్చిన దరఖాస్తులకు, మంజూరుకి పొంతన లేకపోవటంతో మంజూరైన ట్రాక్టర్లు ఎవరికి ఇవ్వాలనే దానిపై అధికారులు అరు నెలలపాటు తర్జన, భర్జన చేసి, చివరికి మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికే ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. నాటి నుంచి నేటివరకు యంత్ర పరికరాల ఊసే ఎత్తడం లేదు. 2022-23 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించటంతో 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకం అమలు చేస్తారని రైతులు ఆశించారు. కానీ అమలు చేయలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. ప్రతీనిత్యం వ్యవసాయ పనుల్లో రైతులకు అధికంగా అవసరమయ్యే స్ప్రేయర్లు, టార్పాలీన్లను కూడా ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్‌లో కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతు న్నారు. రైతు బంధు అమలు చేసినప్పటి నుంచి ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించి యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

### కనిపించని కస్టమ్ హైరింగ్ సెంటర్లు

రైతులకు వరికోత యంత్రాలు కొనుగోలు చేయటం భారం అవుతుందని వ్యవసాయ పనిముట్లు అద్దెకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అద్దె ఎంత ఉండాల్లో గ్రామ పంచాయతీ నిర్ణయించాలి. సీహెచ్‌సీల స్థాపనతో గ్రామీణ యువతకు ఉపాధి, రైతులకు కూలీల సమస్య సాగు వ్యయం, చాకిరి తగ్గుతుందని ప్రభుత్వం ప్రకటించింది. నేటికి ఈ సెంటర్ల జాడేలేదు. అక్కడక్కడ స్వయం సహాయక సంఘాలు కొన్ని యంత్రాలను అద్దెకిస్తున్నాయి. రాష్ట్ర విభాగ పథకం(ఎస్ఎస్ఎస్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకాలను ప్రభుత్వం అమలు చేయడంలేదు. వచ్చే వానాకాలం నుంచయినా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



### సబ్సిడీ పథకం అమలు చేయాలి

ప్రభుత్వం రైతులకు విత్తనాలు, యంత్రాల సబ్సిడీ పథకం అమలు చేయాలి. గతంలో కూరగాయల విత్తనాలతో పాటు స్ప్రే పంపులు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, టార్పాలిన్ కవర్లు సబ్సిడీపై ఇచ్చేవారు. రైతుబంధు, రైతు బీమా వచ్చిన తరువాత సబ్సిడీ మాటనే ఎత్తడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు అందించాలి.

- వెంకటేష్, హన్వాడ



### ప్రభుత్వ పాలసీని అమలు చేస్తం

ప్రభుత్వ పాలసీని అధికారులు అమలు చేయాల్సిందే. ఏనాటినుంచో 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకం అమల్లో ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని పక్కన పెట్టింది. గత ఏడాది నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. కానీ నిధులు విడుదల చేయకపోతే అధికారులం ఏం చేయగలం.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి


వ్యవసాయ పరికరాలు



# ఎండ@43.3 డిగ్రీలు

- అడ్డాకుల, ధరూర్, వడ్డేపల్లిలలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/గద్వాల/నాగర్‌కర్నూల్/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 5: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉష్ణోగ్రత నిప్పుల కొలిమిలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగు తుండటంతో ఎండవేడిమిని తట్టుకోలేక జనం అల్లాడుతు న్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో 43.3 డిగ్రీల రికార్డ్ ఉష్ణోగ్రత నమోదైంది. దేవరకద్ర, గండీడ్ మండలాలలోనూ 43.1 డిగ్రీలు నమోదుకావడంతో జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. బాలానగర్‌లో 42.7, చిన్నచింత కుంటలో 42.6, మిడ్జిల్‌లో 42.2 డిగ్రీలు నమోదుకాగా, మిగతా మండలాల్లో 40 నుంచి 41 డిగ్రీలుగా నమోదు కావడంతో జిల్లాలో వడగాలుల తీవ్రత పెరిగింది.

జోగుళాంబ గద్వాల జిల్లా జిల్లా అంతటా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ధరూర్, వడ్డేపల్లిలో 43.3 డిగ్రీలు నమోదైంది. కేటీదొడ్డిలో 42.8, ఇటిక్యాలలో 42.7, అయిజ లో 42.3, మల్దకల్‌లో 42.3, గద్వాలలో 42.2, రాజోలిలో 42, అలంపూర్‌లో 41.8, ఉండవెల్లిలో 41.7, గట్టులో 40.8, మానవపాడులో 40.6గా నమోదైంది. అదే సందర్భంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.


భానుడి భగభగలకు వనపర్తి పట్టణంలోని మర్రికుంట సమీపంలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 42 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు నమోదైంది. చారకొండ మండలంలో 42.5 డిగ్రీలు, అచ్చంపేటలో 42.4, వంగూరులో 42.3, ఉప్పునుంతలలో 42.2, కోడేరులో 42.0, బల్మూరులో 41.9, వెల్దండలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లాలో పెబ్బేరు మండలంలో అత్యధికంగా 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి, చిన్నంబావిలలో 42.4, పాన్‌గల్‌లో 41.8, పెద్దమందడిలో 41.5, ఘణపూర్, మదనాపూర్ 41.5, ఆత్మకూరు, అమరచింత, గోపాల్‌పేటలలో 41.4 డిగ్రీలు నమోదైంది. శ్రీరంగాపూర్‌లో 40.9, కొత్తకోటలో 40.6, వీపనగండ్లలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 41 డిగ్రీలు గరిష్ఠంగా నమోదు కాగా, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదయ్యాయి.


చల్లదనం కోసం సవాయిగూడెంలో కోళ్ల షెడ్‌పై గడ్డి పరిచిన యజమాని

# సేద తీర చెట్టు నీడ

ఎండల తీవ్రతకు జనం, మూగజీవాలు అల్లాడుతున్నాయి.. ఉదయం 11 గంటలు దాటితే ఇళ్లలో ఉక్కపోతను భరించలేక వృద్ధులు చెట్ల నీడకు సేదతీరుతున్నారు.
అదేవిధంగా మేతకు వెళ్లిన గొర్రెలు, మేకలు, పశువులు చెట్ల కింద సేద తీరుతున్నాయి. కోళ్ల పెంపకందారు లు చల్లదనం కోసం కోళ్ల షెడ్లపైన గడ్డి వేసి నీటిని పిచికారి చేస్తూ కోళ్లను కాపాడుకుంటున్నారు.
ఈ దృశ్యాలు శుక్రవారం వనపర్తి జిల్లా సవాయిగూడెం వద్ద ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి


సవాయిగూడెంలో చెట్టు నీడకు సేదతీరుతున్న వృద్ధులు

# వ్యక్తి దారుణ హత్య

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 5 : ఓ గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య కు గురయ్యాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి వెనకాల గొర్రెల వధశాల దగ్గర గురువారం రాత్రి చోటు చేసుకుంది. డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో జాగిలాలతో, క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన దాసరి మారుతి (40)గా గుర్తించారు. అయన హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవననం కొనసాగించేవాడు. నాలుగు రోజుల క్రితం పట్టణానికి వచ్చాడు. అయితే రాత్రి అయనను గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి, నిప్పు అంటించి హత్యకు చేశారని, హత్యకు కారణాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

# దైవ దర్శనానికి వెళ్తుండగా..
# బొలెరో బోల్తా, ఇద్దరి మృతి

అయిజ, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఉత్తనూర్ గ్రామ సమీపంలో శుక్రవారం దైవ దర్శనానికి వెళుతూ బొలేరో వాహనం బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రంలోని ఇడుపునూర్, మిర్జాపూర్, జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన వారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి 40 మంది వరకు బొలేరో వాహనంలో శుక్రవారం ఉదయం రాయలసీమలోని మద్దిలేటి స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. కర్ణాటక నుంచి సిందనూర్ గ్రామం మీదుగా ప్రయాణం సాగించారు. అయిజ మండలంలోని ఉత్తనూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో గల మలుపు దగ్గరకు రాగానే వాహనం స్టీరింగ్ రాడ్ విరిగిపోవటంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన నాగప్ప, లక్ష్మి దంపతుల కుమారుడు మనోజ్(9) అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటకలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నాగన్న (45)కు తీవ్ర గాయాలు కావటంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయారు. రంగప్ప అనే వ్యక్తి గాయాలతో కర్నూల్‌లో చికిత్స పొందుతున్నాడు. మిగతావారు స్వల్ప గాయాలతో ప్రథ మ చికిత్స చేయించుకొని వెళ్ళారు. ఈ విషయమై అయిజ ఎస్ఐ విజయ్‌భాస్కర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# పుర పీఠం ఎవరిదో?

- నేడే వనపర్తి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం
- పురప్రజల్లో నెలకొన్న ఉత్కంఠ
- పుట్టపాగకే పట్టం అంటున్న కౌన్సిల్ సభ్యులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 5: పుర పీఠ ఎవరికి దక్కనున్నదో నేడు తేలనున్నది. మూడు నెలలుగా వనపర్తి మునిసిపాలిటీలో నెలకొన్న చిక్కుముడి వీడే సమయం ఆసన్నమైంది. ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య నెలకొన్న సందిగ్ధతకు నేడు శుభం కార్డు పడనుంది. అప్పట్లో చైర్మన్, వైస్ చైర్మన్ తీరును వ్యతిరేకించి ముదిరిన ముసలంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీంతో రంగంలోకి దిగిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ ఫలితం దక్కలేదు. చివరిగా వారికున్న రాజకీయ అనుభవంతో అవిశ్వాసం లేకుండా చేయగలిగారే కానీ, చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులను మాత్రం కాపాడలేక పోయారు. ఎట్టకేలకు నేడు ఉదయం 11 గంటలకు వనపర్తి మునిసిపాలిటీకి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక జరగనుంది.

### నేరుగా క్యాంపు నుంచే...

కొత్త సభ్యుల ఎన్నిక సంగ్రామంలో వనపర్తి మునిసిపాలిటీలో రోజుకో మలుపు తిరగడంతో క్యాంపు రాజకీయాలకు దారి తీసింది. 25 మంది సభ్యులు బీఆర్ఎస్ పార్టీ నుంచి అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇద్దరు సభ్యులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల తరువాత బీజేపీ పార్టీకి చెందిన మరో ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు మార్చి 30న పార్టీకి రాజీనామా చేసి ఏప్రిల్ ఒకటిన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 17కు చేరింది. అంతేకాకుండా టీడీపీలో ఉన్న ఒక్క కౌన్సిలర్ కూడా కాంగ్రెస్ పార్టీతోనే మొదటి నుంచి జత కట్టి ఉండటం, కొత్త సభ్యుల ఎన్నికలో ఎమ్మెల్యే ఓటు కూడా ఉండటంతో కాంగ్రెస్ పార్టీకే మునిసిపల్ పీఠం దక్కనుందనేది అందరికి తెలిసిన నిజం. కానీ రాజకీయంలో ఎప్పుడేమి జరుగుతుందో అనుకున్న కాంగ్రెస్ పార్టీ సభ్యులు ముందస్తు జాగ్రతగా 23 మంది సభ్యులను రెండు రోజుల క్రితం క్యాంపునకు తరలించారు. క్యాంపులో ఉన్న సభ్యులు నేడు (శనివారం) నేరుగా సమావేశానికి హాజరై కొత్త సభ్యులను ఎన్నుకోనున్నారు. 17 మంది సంఖ్యాబలం కావాల్సిన కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌లలో 13వ వార్డుకు చెందిన పుట్టపాగ మహేష్, 20వ వార్డుకు చెందిన పాకనాటి కృష్ణ పేర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా గత కొద్ది రోజులుగా వినిపిస్తున్నాయి. మరి కొద్ది గంటల్లో ఏమి జరగబోతుందో వేచి చూడాలి.


వనపర్తి మునిసిపల్ కార్యాలయం

# సాహిత్య విలువల పెంపునకు దోహదం

▸▸ జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 5 : సాహిత్యం సమాజంలో భాషా వికాసానికి, సాహిత్య విలువలు పెంపొందించడానికి దోహదం చేస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్కౌట్స్, గైడ్స్ భవనంలో శుక్రవారం తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సరం సందర్భంగా ఉగాది కవి సమ్మేళనం ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మహిళా సాహిత్య సంస్థ సాహిత్య ఉపన్యాసాలు, కవి సమ్మేళనాలు, పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాహిత్యానికి కొదువలేదన్నారు. మహిళలు ముందుండి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో మహిళా సాహిత్యానికి కొదువలేదని, సంస్థ నుంచి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నేడు సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న సందాపురం బుచ్చయ్య (ప్రముఖ పద్యకవి) డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి (ప్రముఖ పద్యకవి)అల్వాల లక్ష్మణమూర్తి (ప్రముఖ పద్యకవి) సాయి మనస్విని (శాస్త్రీయ సంగీత గాయకురాలు) లకు ఉగాది పురస్కారాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమార్ మాట్లాడుతూ సాహిత్య సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కవులు తమ కవితలను చక్కగా వినిపించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి, అనంతరం పురస్కార గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సిశ్రీదేవి జి.శాంతారెడ్డి, అనురాధ, సక్కుబాయి, వల్లభాపురం జనార్దన్ ఖాజామైనుద్దీన్, జగపతిరావు, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.


ఉగాది పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అయిజ, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జి ల్లా అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. కృష్ణారెడ్డి తన ఇంటికి తాళం వేసి పనిమీద కర్నూల్‌కు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చి చూసే స రికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా రెండు లక్షల రూపాయలు, ఆరు తులాల బంగారం చోరీకి గురైందని గుర్తించారు. ఈ మేరకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వడ్డేపల్లి, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్ శివారు లోని ఉత్తర ఫుడ్స్ సమీపంలో ఉన్న రాఘవరెడ్డి పొలంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం (38) లభ్యమైనట్లు శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. మృతుడి వంటిపై నీలంరంగు డ్రాయ ర్, తెలుపు, గులాబి రంగు పంచె ఉందని, కుడి చేతికి రెండు వరుసల నల్లదారం ఉందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## తనిఖీల్లో నగదు పట్టివేత

బాలానగర్, ఏప్రిల్ 5 : బాలానగర్ మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని బుధవారం చేస్తుండగా రూ.లక్ష నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన నక్కగురు శేఖర్ నగదును తీసుకువెళ్తుండగా, అందుకు సంబంధించిన రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


పట్టుబడ్డ నగదుతో పోలీసు

## కుక్కల దాడిలో జింకకు గాయాలు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : కుక్కల దాడిలో ఓ జింక తీవ్రంగా గాయపడింది. సంఘటనపై ఆటవీశాఖ బీట్ ఆఫీసర్ కీర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో శుక్రవారం జింకల మంద తిరుగుతుండగా కుక్కలు దాడిచేశాయి. ఓ జింక తీవ్రంగా గాయపడి ఉండటాన్ని రైతులు గమనించి అలంపూర్ చౌరస్తాలోని పోలీస్ ఆవుట్ పోస్టుకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ కీర్తి, డ్రైవర్ విజయ్‌తో జీపులో అక్కడికి చేరుకున్నారు. జింకకు ఉండవల్లి పశు వైద్య శాలలో చికిత్స చేయించి, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సమీపంలోని పిల్లలమర్రి అడవిలో వదిలేశారు.


ఉండవల్లి పశువైద్యశాలలో వైద్యం అందిస్తున్న పశువైద్య సిబ్బంది, ఆటవీశాఖ సిబ్బంది

## తప్పిన ప్రమాదం

గండీడ్, ఏప్రిల్ 5 : కారు అదుపుతప్పి కిందపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి వాగు టర్నింగ్‌లో చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 1 గంట సమయంలో మహబూబ్‌నగర్ నుంచి కోస్గికి కారులో వెళ్తుండగా రంగారెడ్డిపల్లి మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు కారు బోల్తాపడింది. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వారికి ప్రాణాపాయం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. కారులోని వారికి స్వల్ప గాయాలు కావడంతో వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## బెల్ట్ షాపుపై దాడి, కేసు నమోదు

ఎర్రవల్లి, ఏప్రిల్ 5 : ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డిలోని బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. 4.14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడు బోగం నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తకోట, ఏప్రిల్ 5 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన జోకూర్ బాలస్వామి వారంరోజుల కిందట అదృశ్యమయ్యాడు. శుక్రవారం వడ్డెవాట గ్రామ శివారులోని దేవబండగుట్ట దగ్గరలో గుర్తు తెలియని శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలానికి వెళ్లారు. శవాన్ని పరిశీలించగా అదృశ్యమైన బాలస్వామిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాలస్వామి కుటుంబ సభ్యులు వచ్చి శవాన్ని పరిశీలించి, బాలస్వామిగా గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 5 : ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం పర్వతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ బొట్టు శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపా లిపేట మంగమ్మ(49) ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఉన్న నేపథ్యంలో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. గతంలోనూ ఈమె ఆత్మహత్యాయత్నం చేయగా ఇరుగుపొరుగు వారు రక్షించినట్లు తెలిపారు. శుక్రవా రం ఉదయం మృతురాలి కుమారుడు రాములు ఇంట్లో లేని సమయంలో ఉయ్యాల కొండికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి, రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 5 : బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మహదేవునిపేటలోని కేఎల్ఐ బ్రిడ్జ్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన సంతోష్(38), మురళీ బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి సొంత పని మీద వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మహదేవునిపేటలోని కేఎల్ఐ బ్రిడ్జ్ సమీపంలో రోడ్డుపై గుంతల్లో బైక్ అదుపుతప్పి కిందపడింది. దాంతో సంతోష్ తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మురళిని 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి చికిత్స కోసం తరలించారు. మృతుడికి భార్య పద్మ, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7న నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్స్ ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు, 7 నుంచి 10 తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నిలువెత్తు నిర్లక్ష్యం

▸ వ్యవసాయ మార్కెట్‌యార్డు నిర్వహణ లోపం అధికారులదే


దగ్ధమైన ధాన్యం

పెబ్బేరు, ఏప్రిల్ 5 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యమే కారణమని తేలింది. మార్కెట్ యార్డు గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గోదాంలో దగ్ధమైన గన్నీ బ్యాగులు పూర్తిగా ఆరిపోవడానికి ఐదు రోజులు పట్టింది. మార్కెట్ యార్డు గోదాంలో కోట్లాది రూపాయల వరి ధాన్యం, గన్నీ బ్యాగులు నిల్వ ఉంచిన గోదాముల వద్ద నిర్వహణా లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్వహణ కేవలం ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నడుస్తోంది. అధికారులు ఎక్కడో ఉండి స్వంత పనులు చేసుకుంటూ ఫోన్ల ద్వారా మార్కెట్‌యార్డును నడిపిస్తున్నారు. అందుకు ఈనెల ఒకటో తేదీన జరిగిన అగ్ని ప్రమాదం ఉదాహరణ. మార్కెట్‌యార్డుకు పాలకవర్గం లేకపోవడం కూడా కారణంగా కనిపిస్తుంది. బాధ్యతతో పనులు నిర్వహించే వారే కనిపించడం లేదు.

### సీసీ కెమెరాలు లేకపోవడం వల్లే..

పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి కారణాలను గుర్తించడానికి ఇబ్బందిగా మారింది. మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఉండి ఉంటే ప్రమాదానికి గల కారణాలను కనిపెట్టే వారు. కోట్ల రూ పాయల ధాన్యం నిల్వ ఉంచిన గోదాముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ముఖ్యంగా సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడంలో కూడా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. గతంలో సెక్యూరిటీ గార్డులు ఉండేవారు. ప్రస్తుతం లేరు. మార్కెట్ యార్డు గోదాములను సివిల్ సప్లై అధికారులకు అద్దెకిచ్చామనే భావనతో మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోలేదు.

సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా వారు నిర్లక్ష్యం చేయడం వల్లే భారీ ప్రమాదం జరి గింది. సివిల్ సప్లై అధికారులు ఎక్కడో ఉండి ఇద్దరు లేదా ముగ్గుర్ని అనధి కార అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకొని వారికి ధాన్యం ఉన్న గోదాములు తాళాలు అప్పగించినట్లు తెలుస్తుంది. వారు కూడా మార్కెట్ యార్డులో ఉండకుండా మార్కెట్‌లో పనిచేసే ఓ హమాలీ సంఘం నాయకునికి తాళాలు ఇచ్చినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన తరువాత అనధికార అసిస్టెంట్లను, హమాలీ సంఘం నాయకుడిని పోలీసులు విచా రిస్తున్నట్లు తెలుస్తుంది. వారి విచారణలో ఏం తేలుతుందో వేచి చూడాలి.


ఇంకా ఆరని పొగలు

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు మార్కెట్‌యార్డు ఆవరణలో మద్యం, గుట్కా, గంజాయితో పాటు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. గతంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యారు. దీనివల్ల దుర్గంధమైన వాసన వస్తున్నప్పటికి అధికారులు పట్టించు కోవడం లేదు. మదనాపురం మార్కెట్‌యార్డుకు సబ్ యార్డుగా ఉన్న పెబ్బేరు మార్కెట్ యార్డును గత ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కల్పించి అభివృద్ధి చెందుతున్న తరుణంలో భారీ అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరం.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు శివారులో జాతీయరహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా, కేశంపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన కడమోని రాజేష్‌కు చెందిన టెంపో ట్రాక్కు మరమ్మతు కోసం బెంగళూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కంచుకుపాడు శివారులో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొన్నది. దీంతో డ్రైవర్ తిప్పలపల్లి రాజేష్ (36) అక్కడిక్కడే మృతి చెందాడు.

## క్షుద్ర పూజలు చేస్తామని టోకరా

గోపాల్‌పేట, ఏప్రిల్ 5 : క్షుద్ర పూజలు చేసి మానసికంగా మంచిగా చేసామని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసిన గుంటూరుకు చెందిన ముగ్గురిని రిమాండ్ చేసినట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. శుక్రవారం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన కందూరు రాజు తన కుమారుడు వెంకటేష్ మానసికంగా వ్యాధితో బాధపడు తున్నాడు. ఎన్ని ఆసుపత్రులు చూపించినా ఫలితం లేకుండా పోయింది. ఒకరోజు మొబైల్‌లో రీల్స్ చూస్తుండగా మానసికంగా లేని వారికి బాగు చేస్తామని రీల్ చూశాడు. దీంతో రాజు వారికి ఫోన్ చేసి తన కుమారుడి పరిస్థితిని గుంటూరుకు చెందిన సిరిగిరి గోపి, సిరిగిరి వెంకన్న, మన్యంలకు వివరించాడు. అదునుగా భావించిన మాంత్రికులు రాజు స్వగృహంలో క్షుద్రపూజలు నిర్వహించి, రెండుసార్లు విజయవాడకు పిలిచి క్షుద్ర పూజలు జరిపించారు. రాజు నుంచి విడతల వారీగా రూ.తొమ్మిది లక్షల 73 వేలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా కుమారుడిలో మార్పు లేకపోవడంతో రాజు వారికి ఫోన్ చేశారు. ఎన్నిసార్లు ఫోన్ చేసిన వారి నుంచి స్పందన రాకపోవడంతో మోసపోయానని గ్రహించి గతనెల 20వ తేదీన పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఎస్సై హరిప్రసాద్, తన టీం విజయవాడలోని నిందితులను గోపి వెంకన్న, మన్యంలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరి నుంచి రూ.ఏడు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై హరిప్రసాద్ కానిస్టేబుల్ వంశీ, అంజి, రాజేష్‌లను సీఐ అభినందించారు.

## నేటికీ రుణమాఫీ చేయలేదు

▸ బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

▸ స్థానికుడిని గెలిపించుకొందాం : మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని బీకే ప్యాలెస్ ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ స్థానికుడిని గెలిపించుకొని స్థానికేతరులను తరిమికొడదామని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మనదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి వందరోజులు అవుతున్నా నేటికి అమలు చేయలేదన్నారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారం పొంది ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాలు చేస్తామన్నారు. తన గెలుపు కోసం ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రంగినేని అభిలాస్ రావు, మునిసిపల్ చైర్మన్ నరసింహగౌడ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# మైనింగ్ చేపడితే ఊరుకునేది లేదు

బల్మూరు, ఏప్రిల్ 5 : మైనింగ్ పనులు చేపడితే ఊరుకునేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 120లో గుట్టపై మైనింగ్ పనులు చేపట్టేందుకు వాట్స్ మైనింగ్ డైరెక్టర్ వేణు శుక్రవారం వచ్చారు. దాంతో గ్రామస్థులు అధిక సంఖ్యలో గుట్ట సమీపంలోని శివాలయం ప్రాంగణానికి చేరుకున్నారు. మైనింగ్ అధికారులు గుట్టపైకి వెళ్లడానికి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తుండటంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మైనింగ్ కాంట్రాక్టర్‌కు, ప్రజలకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని ప్రజలను నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. అయినా ప్రజలు వినిపించుకోలేదు. తమ ప్రాణాలు పోయినా సరే పనులను జరగనివ్వబోమని హెచ్చరించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టను మైనింగ్ తీస్తే తమ ఇళ్లు పూర్తిగా ధ్వంసమవుతాయని ప్రజ లు ఆందోళన వ్యక్తం చేశారు. తాము కోర్టుకు వెళ్లి స్టే తీసుకొస్తామని ఇక్కడ మైనింగ్ పనులు చేపట్టకూడదని గ్రామస్థులు స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక కాంట్రాక్టర్లు వెనుదిరిగారు.


మైలారం గుట్ట సమీపంలో మైనింగ్ అధికారులతో ఘర్షణకు దిగుతున్న గ్రామ ప్రజలు

### మైలారం వెళ్తున్న నాయకులను అడ్డుకున్న పోలీసులు

అచ్చంపేట : బల్మూరు మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం అక్రమంగా జరుగుతున్న మైనింగ్ పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను వంటిమామిడి సమీపంలో అచ్చంపేట, బల్మూరు పోలీసులు అడ్డుకొని అచ్చంపేట పట్టణానికి తరలించారు.

## మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో 272 లీటర్ల మద్యాన్ని పట్టుకొని తమకు అప్పగించినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఇటిక్యాల మండల పంచాయతీరాజ్ ఏఈ పాండురంగ సిబ్బందితో కలిసి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నరేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 232 లీటర్ల మద్యం లభించింది. అలాగే బీర్బరి అలియాస్ చిన్నా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బుడిదపాడు చౌరస్తా మీదుగా కర్నూల్ వైపు వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. అయన వద్ద 39.42 లీటర్ల మద్యం పట్టుబడింది. దాని విలువ రూ. 1.16 లక్షలుగా నిర్ధారించి, ఇద్దరు నిందితులపై ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

## కొనసాగుతున్న పదో తరగతి మూల్యాంకనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : పదవ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం మూడు రోజులుగా ప్రశాంతంగా కొనసాగుతోంది. డీఈవో రవీందర్, పరీక్షల విభాగం అధికారి కమలాకర్‌రావు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు తదితరుల పర్యవేక్షణలో ప్రశాంతంగా సాగుతోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం సాగుతుంది.

### ప్రధానోపాధ్యాయుడి సేవలు మరువలేనివి..

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా గండీడ్ మండలం వెన్నాచేడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శంకరయ్య సేవలు మరువలేనివని డీఈవో రవీందర్ అన్నారు. గత నెల 31న పదవీ విరమణ పొందిన జీహెచ్‌ఎం శంకరయ్యను మూల్యాంకన కేంద్రంలో డీఈవో రవీందర్, పరీక్షల విభాగం అధికారి కమలాకర్‌రావు, సెక్టోరియల్ అధికారులు బైకాని బాలు యాదవ్, దుంకుడు శ్రీనివాస్, జీహెచ్‌ఎంలు, ఎంఈవోలు పూల మాల, శాలువాలతో సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

## కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : జేఈఈ మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష శుక్రవారం కూడా ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ, ఫాతిమా విద్యాలయంలో నిర్వహించారు. ఈ పరీక్షకు ఫాతిమా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 147 మంది హాజరుకావాల్సి ఉండగా 135 మంది విద్యార్థులు హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 147 మందికి గాను 134 మంది హాజరుకాగా 13 మంది విద్యార్థులు హాజరుకాలేదు. జేపీఎన్‌సీఈలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 180 మందికి గాను 159 మంది హాజరుకాగా 21 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది విద్యార్థులకు గాను 162 మంది హాజరుకాగా 18 మంది హాజరుకాలేదు.

## మాదిగలకు కేటాయించకపోవడం సరికాదు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బిజినేపల్లి, ఏప్రిల్ 5 : రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వ్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్క స్థానం కూడా మాదిగలకు కేటాయించకపోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కరిగళ్ల దశరథం అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన వ్యక్తం చేసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు అధికార పార్టీ కనీసం ఒక పార్లమెంట్ స్థానం కేటాయించకుండా అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారానే కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లోని మాదిగలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశోక్, కరిగళ్ల రాజు, చెన్నయ్య, ఊశన్న తదితరులున్నారు.

## నేడు కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కోడేరు, ఏప్రిల్ 5 : కొల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం కొల్లాపూర్ మండల కేంద్రంలో ఎస్ఎం ఫంక్షన్ హాల్ బస్సు డిపో ఎదురుగా ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హాజరవుతారన్నారు. కోడేరు మండలంలోని గ్రామాగ్రామాన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సానుభూతిపరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న మంగనూర్‌కు ప్రొఫెసర్ కాశీం రాక

బిజినేపల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని మంగనూర్‌లో ఈనెల 13న పూలే అంబేద్కర్ ఆలోచనా విధానంపై ప్రసంగించేందుకు ముఖ్య వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కాశీం రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలో మంగనూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వాహణ కరపత్రాలను వివిధ సంఘాల నాయకులుతో కలిసి విడుదల చేశారు. ఈనెల 13న సాయంత్రం నిర్వహించనున్న సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.

## అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

దోమలపెంట, ఏప్రిల్ 5: పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అమ్రాబాద్ మండల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటయ్య హెచ్చరించారు. శుక్రవాకం అమ్రాబాద్ మండల పరిధిలోని వటువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట, పాతాలగంగ గ్రామాలలో హోటళ్లు, కిరాణ షాపులను తనిఖీ చేశారు. ఈయన వెంట హెడ్ కానిస్టేబుల్ బాలునాయక్, సిబ్బంది ఉన్నారు.

## 'రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలి'

కొల్లాపూర్, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో తెలంగాణ రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తాన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కూడా నేటికీ రైతు రుణమాఫీ ఊసే ఎత్తడం లేదని బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులకు కేవలం నాలుగెకరాల వరకే రైతుబంధు జమ అయిందని వెంటనే రైతుబంధుతోపాటు రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు బి.రాజు, రామకృష్ణ, శివశంకర్, సంజీవ్, సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యారంగ సమస్యలపై పోరాడుతాం'

కొల్లాపూర్, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో నెలకొన్న విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.తారాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కొల్లాపూర్ మండల పరిధిలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతన విద్యా విధానం రద్దుకై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీని తారాసింగ్ ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడుగా తరుణ్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, ఉపాధ్యక్షుడురామకృష్ణ, భానుప్రసాద్, నందకుమార్, సహాయ కార్యదర్శులుగా నితిన్, మంజునాథ్, సత్యనారాయణలతోపాటు పది మందితో కూడిన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## పేద ముస్లిం మహిళలకు దుస్తులు పంపిణీ

కొల్లాపూర్, ఏప్రిల్ 5 : పవిత్ర రంజాన్ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు పట్టణ పేద ముస్లిం మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, మత పెద్దలు మెహిదీనవాజ్, జమీల్‌అహ్మద్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఆకునమోని రాముయాదవ్, వెంకటస్వామి, కాంతారావు, జుబేర్‌ఖాన్, జావీద్‌ఖాన్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వంగూరు ఏప్రిల్ 5 : మండలంలో పీఏసీఎస్ రంగాపూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో విష్ణుమూర్తి కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వరి పంటకు కనీస మద్దతు ధర పొందాలంటే రైతులు ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొని వచ్చే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ ధృవపత్రాలను తీసుకొని రావాలన్నారు.

## భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 5: ప్రతీ ఒక్కరు భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ఫౌండరి ట్రస్ట్ జూలురి రమేష్‌బాబు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం గోపూజ, వాసవి మాత పారాయణం జూలురి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ అర్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, ప్రకాస్, నర్సింహులు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో అదృశ్యమైన మహిళ క్షేమం

మన్ననూర్, ఏప్రిల్ 5: అయోధ్యకు వెళ్లి తప్పిపోయిన మన్ననూరు గ్రామానికి చెందిన తోటపల్లి వెంకటమ్మ ఆచూకీ లభించింది. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన వెంకటమ్మ ఆటోలో దర్శనానికి వెళ్తున్న క్రమంలో దారి తప్పిపోయింది. మన్ననూరు నుంచి మహిళ కుమారులు నరేష్, రమేష్ లు అయోధ్యకు వెళ్లి పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేసి గాలించారు. తప్పిపోయిన మహిళ చరవాణీ ఆలయ దర్శనం చేసుకునే సెల్‌ఫోన్ కౌంటర్‌లో ఉండడంతో మహిళను వెతకడం ఇబ్బందిగా మారింది. చివరకు అయోధ్యలో ఆటోలు నడిపే డ్రైవర్ల ద్వారా వాట్సాప్ గ్రూపుల్లో మహిళ ఫొటోలు పెట్టి గాలించారు. చివరకు శుక్రవారం తెల్లవారుజామున అయోధ్య ఆలయానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వెంకటమ్మ దొరికింది. వెంకటమ్మను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకటమ్మ ను గుర్తించిన ఆటో యూనియన్ నాయకులకు కుమారులు రమేష్, నరేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## గంజాయి సాగు చేసిన రైతుపై కేసు నమోదు

మన్ననూర్, ఏప్రిల్ 5: అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలోని ఓ మిరప తోటలో ఐదు గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ కథనం మేరకు వివవరాలు.. మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన నారాయణ కౌలుకు తీసుకున్న పొలంలో మిరప పంటను సాగు చేస్తున్నాడు. అంతరపంటగా గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు సమాచారం అందుకున్న సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ రమేష్ శుక్రవారం మిరప తోటలో తనిఖీలు నిర్వహించగా ఐదు గంజాయి మొక్కలు లభించాయి. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి మిరప తోట యజమాని నారాయణపై కేసునమోదు చేశామని సీఐ తెలిపారు.

## యువకుడి అదృశ్యం - కేసు నమోదు

అమ్రాబాద్, ఏప్రిల్ 5: అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామంలో యువకుడు అదృశ్యంకాగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గంటల రవి అనే యువకుడు భార్య సరోజతో తగాదా పడ్డాడు. ఈ నెల 3న ఉదయం ఇంటి నుంచి రవి వెళ్లిపోయాడని, తిరిగి ఇంటికి రాలేదని తల్లి గంటల మారోని శుక్రవారం అమ్రాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

మన్ననూర్, ఏప్రిల్ 5: మద్యం తాగిన మైకంలో మతిస్థిమితం కోల్పోయి మన్ననూరు గ్రామంలో ఓ యువకుడు గాజు సీసాతో తలపై బాదుకొని తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాళిదాసు అ యువకుడికి తల్లిదండ్రులు లేరు. చిన్నపాటి కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో ఖర్చులు వెల్లదీసుకుంటుంటాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయి గాజు సీసాలతో తన తలపై బాదుకోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై అపస్మారక స్థితిలో ఉండడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు.

# ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి
- నివాళి అర్పించిన ప్రజాసంఘాల నాయకులు



అచ్చంపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు అని కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ కొనియాడారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ సమీపంలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి అత్యున్నత ఉప ప్రధాని స్థాయికి ఎదగడానికి వారు చేసిన కృషి ఎనలేనిదన్నారు. నేటి యువత మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకుని గుణాత్మకమైన విద్యా విధానాలు నేర్చుకుని ఉన్నత పదవులు చేపట్టి నేటి సమాజం గుర్తుండిపోయేలా సేవా ఫలాలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

● **అచ్చంపేట** : అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

● **తెలకపల్లి:** స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగిద్దామని మండల నాయకుడు రెడ్డపాకుల శివశంకర్ అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాల వేశారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శివశంకర్, రాకేష్, శ్రీకాంత్, శివ, సంపత్ పాల్గొన్నారు.

● **వెల్దండ:** మండలకేంద్రంలోని రామన్నగడ్డ కాలనీలో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, నాయకులు అనిల్, రాము, లింగం, కిష్టాలు, శ్రీను తదితరులున్నారు.

● **తాడూరు** : భారత స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు యువత, విద్యార్థులు, దళిత సమాజం చేయాలని అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కొమ్ము భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం తాడూరు మండలం అంతారం గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగానే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు కృష్ణయ్య, మశన్న, లక్ష్మయ్య, ఆంజనేయులు, సుల్తాన్, కొమ్ము బసవయ్య, జక్కయ్య, రామాంజనేయులు, బాలయ్య, శుద్ధకంటి కృష్ణయ్య, బాలనాగయ్య, పెద్ద మశన్న పాల్గొన్నారు.

● **కందనూలు:** విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ అధికార ప్రతినిధి దిలీపాచారితో కలిసి పూలమాల వేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి శ్రీధర్, మండల అధ్యక్షుడు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వెంకటశెట్టి, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, ప్రభాకర్, పాండు, లింగారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణయ్య, విశ్రాంత ఉద్యోగస్తులు పాల్గొన్నారు. అలాగే జగ్జీవన్‌రాం జయంతిని జైభీమ్ దీక్షా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ముందు గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీమ్ దీక్షా సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవరపాగ బంగారయ్య, కొత్త పరుశరాములు, నాయకులు పాల్గొన్నారు.

● **బిజినేపల్లి** : మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు కాంస్య విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ మంగి విజయ్ పూలమాల వేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేతాజీ యూత్ క్లబ్ ఆవరణలో జగ్జీవన్ చిత్రపటానికి మండల అధ్యక్షుడు మిద్దె రాములు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీడీవో కతాలప్ప, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీవో రాములునాయక్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాన్యానాయక్, మండల కోఆప్షన్ జహంగీరొద్దీన్, కరిగళ్ల దశరథం, చెన్నయ్య, రామచంద్రయ్య, విజయకాంత్, పరుశరాములు, సత్యంనాయక్, రవి, నరిగే ఊశన్న, శ్రీశైలం తదితరులు న్నారు.

● **అమ్రాబాద్:** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొయ్యల వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు మల్లేష్, బాల్ సాయిలు, బాలరాజ్, భారతి తదితరులున్నారు.

● **పెద్దకొత్తపల్లి:** పెద్దకొత్తపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నలక్ష్మీ పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాములు, వీఆర్ఏలు ఖాజా, లోకేష్, సయ్యద్, కర్రెన్న, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణంలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రాం విగ్రహానికి కేవీపీఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, నాయకులు సంజు, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

● **పెంట్లవెల్లి** : మండల కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రాజేష్, బండారి శ్రీనివాసులు, రమేష్, మీసాల లక్ష్మయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసిన యువకులు



నాగర్‌కర్నూల్ పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జైభీమ్ దీక్షా సమితి సభ్యులు



అమ్రాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న సిబ్బంది



వెల్దండలోని రామన్నగడ్డ కాలనీలో నివాళి అర్పిస్తున్న నాయకులు

# ముస్లింలకు మంత్రి జూపల్లి ఇఫ్తార్



కొల్లాపూర్‌లో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, ఏప్రిల్ 5 : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలున్న కొల్లాపూర్ పట్టణ ముస్లింలకు శుక్రవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇఫ్తార్ విందు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో కలిసి మంత్రి జూపల్లి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముందుగా ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు పండ్లు, మిఠాయిలు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం పట్టణంలోని మసీద్‌లో నెలరోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు చేయించి హాఫీజ్‌లకు మసీద్‌లో సేవలు చేసిన మహాజన్‌లకు మంత్రి జూపల్లి శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించి నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం, పట్టణ కౌన్సిలర్లు షేక్ రహీంపాష, ఎండి.నయీమ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, అన్వర్, ముస్తాక్, ఖాదర్‌పాష, తాహెర్‌పాషా, జహీర్, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నేటి జనజాతర సభకు భారీగా తరలిరావాలి**

నేడు తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభకు కొల్లాపూర్ నియోజకవర్గ పరిధి నుంచి భారీగా తరలి రావాలని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొల్లాపూర్ మునిసిపల్ కౌన్సిలర్లు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో మంత్రి జూపల్లి ప్రత్యేక సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి వంద రోజులు పూర్తైన సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తూచా తప్పకుండా అమలుపర్చడంతో నిర్వహిస్తున్న జనజాతర సభకు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివెళ్లి ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుదామని జూపల్లి పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ ప్రజలంతా కాంగ్రెస్ వైపే

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 5 : ప్రధాని మోదీ పాలనను దేశ వ్యాప్తంగా ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సంక్షేమాన్ని కోరే కాంగ్రెస్ వైపే ప్రజలు చూస్తున్నారని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతం కాబోతున్నాయని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి జోస్యం చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా తుక్కుగూడలో నిర్వహించన్ను జన జాతరకు నియోజకవర్గం నుంచి 20వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఐదు గ్యారంటీలను తుక్కుగూడ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ, సీఎంఎనుముల రేవంత్‌రెడ్డిలు ప్రకటిస్తారని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వ్యవహరించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లోను ఎంపీ అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ పార్టీ చేపట్టిందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రూ. 28వేల కోట్లు అప్పులు చేసిన నిర్మించిన పీఆర్ఎల్ఐని నీరుగార్చి ప్రజలకు అప్పులే మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనన్నారు. ప్రజలను ఏనాడు పట్టించుకుని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో తాను గతంలో రూ.178కోట్లతో కేఎల్ఐ డీ-82కు నిధులు మంజూరు చేయించి 95శాతం కాల్వ పనులు పూర్తి చేయించానని పేర్కొన్నారు. వర్షాకాలంలో చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు కేఎల్ఐ డీ-82 ద్వారా సాగునీరందిస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలుపరుస్తామని ప్రజలెవరూ సందేహపడాల్సినవసరం లేదన్నారు. తుక్కుగూడలో జరిగే జన జాతర సభకు భారీ ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ ఎన్నికల పరిశీలకురాలు ఇందిర, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు ఎన్నం భూపతిరెడ్డి, కశిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

# అన్ని వసతులు కల్పిస్తాం

- దోమలపెంట ఎఫ్ఆర్వో గురుప్రసాద్



సార్లపల్లిలో అగ్రిమెంట్ బాండ్లపై సంతకాలు చేస్తున్న లబ్ధిదారులు

దోమలపెంట, ఏప్రిల్ 5: పునరావాస గ్రామాల లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తామని దోమలపెంట ఎఫ్ ఆర్వో గురుప్రసాద్ అన్నారు. స్వచ్ఛంద పునరావాస ప్యాకేజీలో భాగంగా ఎన్‌టీసీఏ పథకం కింద అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో 186 కుటుంబాలు స్వచ్ఛందంగా గ్రామం విడిచి వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. శుక్రవారం అటవీశాఖ అధికారులు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎంవోయూ (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) బాండ్లపై సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా దోమలపెంట ఎఫ్ఆర్వో గురుప్రసాద్ మాట్లాడుతూ 186 మంది పునరావాస ప్యాకేజీలో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామంలో అన్నివసతులతో కాలనీ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సార్లపల్లిలో 101 కుటుంబాలకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, ఇంటి నిర్మాణం ఇతర వసతులు కల్పించే జాబితాలో ఉండగా, 85 మంది రూ. 15 లక్షల ప్యాకేజీ తీసుకునేందుకు అంగీకరించారన్నారు. త్వరలోనే కుడిచింతలబావి గ్రామంలో ఎంవోయూ అగ్రిమెంట్ చేసుకుంటామని, వటువర్లపల్లిలో ఆర్అండ్‌బీ సర్వే నిర్వహించి త్వరలోనే లబ్ధిదారులను గుర్తిస్తామని ఆయన వివరించారు. సమావేశంలో ఎఫ్‌బీవోలు మాధవరెడ్డి, రాజేశ్వరి, శివ ఎన్‌జీవో బాపిరెడ్డి పునరావాస గ్రామ కమిటీ అధ్యక్షుడు పున్నమూరి విష్ణు, సంతోష్, వెంకటేష్, రమేష్ తదితరులున్నారు.

## మహానంది పురస్కారానికి వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంపిక

తెలకపల్లి, ఏప్రిల్ 5 : కోలాట కళారంగంలో విశేష కృషి చేసిన మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు మామిళ్ల శేఖర్ మహానంది పురస్కారానికి ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక, శ్రీవిరాట్ విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని ఏప్రిల్ 14 ఉదయం 10గంటలకు త్యాగరాయగాన సభ, కళా వెంకట దీక్షితులు కళా వేదికలో ముఖ్య అతిథులు పురస్కారాన్ని అందజేయనున్నట్లు వివరించారు. మహానంది పురస్కారానికి ఎంపిక కావడంపై మామిళ్ల శేఖర్‌కు మండల ప్రజలు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

## 9న ఉగాది కవి సమ్మేళనం

కందనూలు, ఏప్రిల్ 5 : క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 9న నాగర్ కర్నూల్‌లోని సింగిల్ విండో హాల్‌లో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి వనపట్ల సుబ్బయ్య, వహీద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కవులు, కవయిత్రీలు హాజరుకావాలని వారు కోరారు.

## ముస్లింలకు పండ్లు పంపిణీ

వెల్దండ, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని మసీదులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముస్లింలకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, రహమాన్, రషీద్, సాదిక్, వలీ, సాదిక్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ, ఏప్రిల్ 5 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన చెదురుపల్లి గ్రామానికి చెందిన పాల వెంకటయ్య కుటుంబాన్ని శుక్రవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, మాజీ సర్పంచ్ పర్వతాలు, వినోద్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటయ్య రూ.11 వేల నగదు, క్వింటాలున్నర బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యాదమ్మ, రామకోటి, శివ, కృష్ణయ్య, రామకృష్ణ, నారయ్య, పర్వతాలు, వెంకటయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

ఉప్పునుంతల, ఏప్రిల్ 5: మండల పరిధిలోని రాయిచెడులో శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ మండల నాయకుడు గొడుగు వెంకటయ్య తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సైదయ్య, గ్రామ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటయ్య, సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటయ్య, కోశాధికారి చెన్నయ్య, సభ్యులను ఎన్నుకు న్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కల్వకుర్తి, ఏప్రిల్ 5: ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లెపల్లి జగన్‌ను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయవాది వృత్తితో పాటు కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.